www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 5 ఫిబ్రవరి 2024

నేడు యథావిధిగా 'జగనన్నకు చెబుదాం'

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

పేదలకు ద్రోహం చేసిన ప్రభుత్వాన్ని సాగనంపాలి

విసికె సత్యాగ్రహ దీక్షలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-మదనపల్లి

తమది పేదల ప్రభుత్వమని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్ని సన్నాయి నొక్కులు నొక్కినా, ముమ్మాటికీ జగన్‌ది పెత్తందార్ల ప్రభుత్వమేనని, పేదలకు ద్రోహం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని వెంటనే సాగనంపాలని విసికె పార్టీ నిర్వహించిన సామాజిక సత్యాగ్రహంలో టిడిపి, జనసేన, కాంగ్రెస్, సిపిఐ, సీపీఎం పార్టీల నేతలు పిలుపునిచ్చారు. ఆదివారం మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట విసికె పార్టీ ఆధ్వర్యంలో సామాజిక సత్యాగ్రహం పేరుతో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ఎం.షా జహాన్ బాషా, జనసేన రాయలసీమ కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి, కాంగ్రెస్ నాయకుడు రెడ్డి సాహెబ్, సిపిఐ నాయకుడు కోటూరి మురళీ, వాల్మీకి సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు పాల్గొని పాల్గొని, సత్యాగ్రహ దీక్షకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ సర్కార్ చేస్తున్న సామాజిక విద్రోహంపై నిప్పులు చెరిగారు. సకల సామాజిక వర్గాలకూ అన్యాయం చేసిన జగన్ సర్కారు, సామాజిక న్యాయ సాధికార యాత్ర అంటూ నిస్సిగ్గుగా ఊరేగుతుందని ఎద్దేవా చేశారు. అనంతరం విసికె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.టి.యం శివప్రసాద్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో పేద, మధ్య తరగతి వర్గాలకు తీరని అన్యాయం జరిగిందని,

సత్యాగ్రహ దీక్షలో వివిధ పార్టీల నాయకులు

నాలుగున్నర ఏళ్లుగా జగన్ సర్కారు చేస్తున్న దగాపై పేదల ధర్మాగ్రహాన్ని ఈ ప్రభుత్వానికి తెలియజేసేందుకే సామాజిక సత్యాగ్రహం చేపట్టామని తెలిపారు. సత్యాగ్రహంలో పాల్గొని సంఘీభావం తెలిపిన వివిధ పార్టీల నేతలకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. ప్రతి వసతి గృహాల్లోని విద్యార్థులకు తప్పని సరిగా మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. పేదలకు మూడు సెంట్ల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం చేయాలన్నారు. దళితవాడలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి,మైనార్టీ, కాపు, ఇతర కార్పొరేషన్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సమస్యల పరిష్కారం కోసం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విసికె రాష్ట్ర అధికార ప్రతినిధి యు. గణపతి, రాష్ట్ర కార్యదర్శులు ముత్యాల మోహన్, డాక్టర్ ప్రభు, పాలకుంట శ్రీనివాసులు, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) నాయకులు ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, పల్లం తాతయ్య, బురుజు లక్ష్మీనారాయణ, సచిన్, బాలకృష్ణ, టి.ఎ. పీర్ బాషా, రవిశంకర్, రెడ్డిప్రసాద్, రాయల్ సూరి, తలారి కృష్ణ, క్రాంతి, జనార్దన్, గంగాధర్, చంద్ర, ఇర్ల రమణ, సిపిఐ నాయకులు తోపు కృష్ణప్ప, సాంబశివ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు సత్యాగ్రహంలో పాల్గొన్నారు.

పాత పింఛను పునరుద్ధరించే వారికే ఓటు

ప్రజాశక్తి - రాయచోటి

పాత పింఛను పునరుద్ధరణకు హామీ ఇచ్చే వారికే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఓటు అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.హరి ప్రసాద్, షేక్ జాబీర్ తెలిపారు. ఆదివారం స్థానిక అలీమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగిగా జీవితకాలం సేవలు అందించి విరమణ అనంతరం భవిష్యత్తు భద్రత కోసం పోరాడి సాధించుకున్న పెన్షన్‌ను ప్రస్తుత కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు రద్దు చేసి సిపిఎస్..జిపిఎస్ అంటూ వారి భవిష్యత్తును అంధకారంలో నెట్టే చర్యలకు పాల్పడిందని వాపోయారు. ఎవరైతే ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పింఛను ఇస్తామని వారి మేనిఫెస్టోలో ప్రకటిస్తూ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మొదటి సంతకం చేస్తామని హామీ

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఇస్తారో వారికే తమ ఓటు అనే నినాదాన్ని ఉద్యోగ ఉపాధ్యాయులతో పాటు ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు ప్రసాద్, రాయచోటి మండల అధ్యక్షులు హఫీజుల్లా, సహ అధ్యక్షుడు రఫీ, చిన్నమండెం మండలం సహాధ్యక్షుడు కిఫాయతుల్లా, మండల కోశాధికారి ఆదిల్, గాలివీడు మండల నాయకులు రియాజ్ పాల్గొన్నారు.

'నాకోసం రెండు సార్లు నొక్కండి' అనడం హాస్యాస్పదం

సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

'జగనన్న మీ కోసం 124 సార్లు బటన్ నొక్కాడు.. మీరు కేవలం జగనన్న కోసం రెండు సార్లు బటన్ నొక్కండని, ఈ విషయం ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పండంటూ బహిరంగ సభలో జగన్మోహన్‌రెడ్డి' అనడం హాస్యా స్పదంగా ఉందని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి కోటపల్లె బాబురెడ్డి, మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పీలేరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవస్థలను చెప్పుచేతల్లో పెట్టుకుని పెట్టుబడులు రాక, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలులేకతే ఆరోజు చంద్రబాబు కియా కార్ల కంపెనీ రప్పించి ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించారని చెప్పారు. ప్రస్తుతం జగన్ రెడ్డి జాకీ, అమరరాజా కంపెనీలను వెళ్లగొట్టడం, కార్మికుల కడుపుకొట్టడం తగదని అన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రద్దుచేసి నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెంచడం తగదని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సాధికారిక కార్యదర్శి పురం రామ్మూర్తి, పట్టణ అధ్యక్షులు సురేష్ కుమార్ రెడ్డి, అనే కంచి సూరి, ప్రధాన కార్యదర్శి, పసుపులేటి లక్ష్మీకర, ప్రముఖ నాయకులు కొత్తపల్లి శ్రీనాథ రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర, హరి, మైనార్టీ నాయకులు షౌకత్, మాజీ ఉప సర్పంచ్ మహమ్మద్ పీర్, జయచంద్రా రెడ్డి, ఎస్‌సి సెల్ నాయకులు సుభాష్, కృష్ణయ్య, బిసి నాయకులు గాండ్ల విజయ్ కుమార్, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు ముబారక్, షరీఫ్, శ్రీనివాసులు, బాబు, వెంకట రమణ నాయక్ పాల్గొన్నారు.

రహదారి ఆక్రమణను అడ్డుకోవాలి

మీడియా సమావేశంలో రైతుల వేడుకోలు

ప్రజాశక్తి -రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరు సమీపంలో ఉన్న అశోక్ గార్డెన్స్ ఎదురుగా 1497 సర్వే నెంబర్‌లో 43 సెంట్ల పోరంబోకు స్థలాన్ని ప్రస్తుతం కడప నగరంలో నివాసం ఉంటున్న రాజంపేటకు చెందిన ఊటుకూరు గ్రామస్తుడు ఆక్రమించుకుని పొలాలకు వెళ్లేందుకు దారిలేకుండా చేశాడని రైతులు పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ కబ్జాదారుడు 1999లో సరస్వతమ్మ మంత్రిగా ఉన్న హయాంలో తన రాజకీయ పరపతిని వినియోగించుకుని 35 సెంట్లు రాజంపేటలో, 8 సెంట్లు కడపలో ఫేక్ రికార్డులు చేసుకుని ఆక్రమించుకున్నాడని వాపోయారు. ఉన్న పొలాలలోకి రైతులు వెళ్లేందుకు వీలు లేకుండా అడ్డుపడుతున్నాడని ఆరోపించారు. 115 అడుగుల మేర ఉన్న రాస్తాను ఆక్రమించి దౌర్జన్యంగా సర్వే రాళ్లను నాటి కంచె నిర్మించి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తాము 2014 నుంచి న్యాయం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని, రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టినా తిరిగి కోర్టుకు వేసి తమనే అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తెలిపారు. తమ పొలాల్లోకి వెళ్లేందుకు కనీసం ఐదు అడుగుల

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రైతులు

స్థలం కోరినా ససేమిరా అంటున్నాడని వాపోయారు. తమ పొలానికి సమీపంలోని భువనగిరి పల్లె, కొండలోపల్లె, రాంనగర్, డి బి ఎల్ పల్లెకు చెందిన సుమారు 500 మంది రైతులను ఇక్కట్లు పాలు చేస్తున్నారని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించి తమ పొలాలకు వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు నాగేశ్వర రాజు, మాధవ రాజు, సుబ్బు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారమే సిఎం లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఇళ్లు లేని నిరుపేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చేతులమీదుగా ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 3458 ఎకరాల డికెటి పట్టాలను సెటిల్‌మెంట్ పట్టాలుగా, 4391 ఎకరాల చుక్కల భూములను క్రమబద్ధీకరించి రైతులకు మేలు చేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే సాధ్యమన్నారు. అనంతరం 168 మందికి ఇళ్ల పట్టాలను, 65 మందికి ఫ్రీ హోల్డ్ పట్టాలను అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, నీళ్లభాస్కర్, శంకరాచారి, రఘు పాల్గొన్నారు.

ఇంటి పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

వాల్మీకిపురం : ప్రతి ఒక్కరూ కేన్సర్ ప్రాథమిక దశలో గుర్తించడం వల్ల మహమ్మారిని తరిమికొట్టొచ్చని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. ఆదివారం స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక మరణాలకు కారణం అవుతున్న వ్యాధుల్లో కేన్సర్ కూడా ఒకటని, మన జీవనశైలి, పొగతాగడం, మద్యపానం, గుట్కా వంటి అలవాట్ల వల్ల కేన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, ఉపాధ్యాయురాలు సోఫియాబేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పోలీసుస్టేషన్‌లో వాహనాలకు వేలం

వాల్మీకిపురం : అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక పోలీసుస్టేషన్‌లో రాయచోటి డిఎస్‌పి మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నాగేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఒక క్వాలిస్ , రెండు పల్సర్ వాహనాలకు వేలం వేయనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొన దలచిన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

బోర్డు ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా పీర్‌బాషా

వాల్మీకిపురం : జాతీయ మానవ హక్కుల కమిషన్ సౌత్ ఇండియా బోర్డు ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్‌గా వాల్మీకిపురం పట్టణం కొత్తపేటవీధికి చెందిన పీర్‌బాషా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అదనపు బాధ్యతలు అప్పగించిన హెచ్ఆర్‌సి బోర్డుకు కృతజ్ఞతలు తెలిపారు. తన సేవను గుర్తించి తనకు పదవిని ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హక్కుల రక్షణ కోసం మరింత కృషి చేస్తానన్నారు. అనంతరం పట్టణ ప్రముఖులు, నాయకులు, సంస్థ సభ్యులు పీర్‌బాషాను అభినందించారు.

పార్టీ విజయానికి కృషి చేయండి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషి చేయాలని ఎపిఎండిసి డైరెక్టర్ హరీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డి, ఎంపీగా మిథున్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 11న అనంతపురంలో నిర్వహించే సిద్ధం కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని, కార్యక్రమాన్ని భారీ సంఖ్యలో విజయవంతం చేయాలన్నారు. అనంతరం హరీష్ రెడ్డిని గ్రామస్తులు దుశ్శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, నరసింహులు, లక్ష్మీనారాయణ రెడ్డి, చెంగల్ రెడ్డి, శ్రీరాములు, చిన్నప్ప, సుధాకర, శ్రీరాములు, నాగేంద్ర, గంగులప్ప, శీనా పాల్గొన్నారు.

మేకలవారిపల్లిలో పర్యటిస్తున్న ఎపిఎండిసి డైరెక్టర్ హరీశ్‌రెడ్డి

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు : జడ్‌పి చైర్మన్

క్రీడాకారులతో ఆకేపాటి అమర్‌నాథరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

క్రీడలతో ఆరోగ్యంతో పాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలోని అన్నమయ్య తేక్వాండో అకాడమిలో మాస్టర్ సైనాల పిచ్చయ్య ఆధ్వర్యంలోతేక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ తో పాటు ఫస్ట్ డాన్ బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్లు, బెల్టుల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ నేటి యువత మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందడం ఆవశ్యమని తెలియజేశారు. మార్షల్ ఆర్ట్స్ సాధన వల్ల ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వంతో పాటు విద్య, ఉపాధిలోనూ మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలియజేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి దాసరి పెంచలయ్య, వైసిపి నాయకులు, కృష్ణాస్ లైఫ్ హాస్పిటల్ ఎండి డాక్టర్ విన్యా, బ్రాహ్మణపల్లి సర్పంచ్ ముబారకున్నిషా బేగం, కోచ్‌లు జహిద్ అలీ, సుధాకర్ బాబు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసిపిని ఎదుర్కొనే సత్తా టిడిపి, జనసేనకు లేదు

- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్రంలో త్వరలో జరుగబోవు శాసనసభ ఎన్నికల్లో వైసిపిని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనే సత్తా టిడిపి-జనసేన కూటమికి లేదని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఖాజాఖాన్ మొదటి వీధిలో నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలను కలిసి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎదుర్కొనే సత్తా లేకనే చంద్రబాబు నాయుడు పవన్ కల్యాణ్‌తో జత కలిసి కూటమిగా ఏర్పడి ఎన్నికలకు సిద్ధమవుతున్నారని తెలిపారు. ఎంతమంది కూటమిగా వచ్చిన వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనంలో తుడిచిపెట్టుకుపోతారని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లాగా జగనన్న గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, వైసిపి పట్టణ అధ్యక్షుడు సిఆర్ చిన్నికృష్ణ, జెఎసి మండల కన్వీనర్ రెడ్డిహరి, జిల్లా

కార్యకర్తలతో మాట్లాడుతున్న ద్వారకనాథ్‌రెడ్డి

ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా, సచివాలయ కన్వీనర్లు జివి రామకృష్ణ, జి.చాంద్ బాషా, జగనిజం నరసింహనాయుడు, అభిలాష్ రెడ్డి, సద్దాం, ఎంవి కృష్ణయ్య, ఎంపిటిసి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత విమర్శలు తగవు : టిడిపి

కడప అర్బన్ : డిప్యూటీ సిఎం అంజాద్ బాషా తమను వ్యక్తిగతంగా విమర్శించడం తగదని టిడిపి పోలిటీ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాధవి రెడ్డి అన్నారు. ఆదివారం అష్ట లక్ష్మి కళ్యాణ మండపంలో ఆర్ఎస్‌యూ రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు రవిశంకర్ రెడ్డి అతని అనుచరులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవాకులు చెవాకులు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఫ్లెక్సి రాణి అని మాధవిరెడ్డిని ఉద్దేశించి మాట్లాడిన డిప్యూటీ సిఎం అంజాద్ బాషాకు సంస్కారం లేదన్నారు. ప్రజల్లోకి వెళ్లడానికి ఫ్లెక్సిలు వేశామని, కార్పొరేషన్ ట్యాక్సులు కట్టి ఫ్లెక్సిలు వేస్తున్నామని చెప్పారు. అంజాద్‌బాషా, అతని తమ్ముడు, అల్లుడు పుట్టిన రోజుకు ఫ్లెక్సిలు వేసుకున్నారని తెలిపారు. కబ్జాల పంపకాల్లో తేడా వచ్చి నడిరోడ్డు పై హత్య లు చేసుకుంటున్న వైసిపి శ్రేణులు అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే కాకపోయినా ప్రజా క్షేత్రంలో ఉన్నామని చెప్పారు. అంజాద్ బాషా కబ్జాలపై డిబేట్ కి సిద్ధం అన్ని సవాల్ విసిరారు. కార్యక్రమం లో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్, రాష్ట్ర బెస్త సాధికారిక సంఘం అధ్యక్షులు రాంప్రసాద్ నాయకులు పాల్గొన్నారు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీనివాసులరెడ్డి, మాధవి

వితరణ కార్యక్రమంలో మిట్స్ విద్యార్థులు

వెలుగు ప్రత్యేక పాఠశాలకు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె సమీపంలోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లె కళాశాల ఎంసిఎ విభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు స్థానిక వెలుగు ఫౌండేషన్ వారికి హెల్పింగ్ హ్యాండ్స్, మిట్స్ విద్యార్థులు సంయుక్తంగా ఆదివారం బియ్యం బస్తాలు, నోట్ పుస్తకాలు అందజేశారు. వెలుగు ప్రత్యేక పాఠశాలకు చెందిన వంద మంది విద్యార్థులకు పెన్ను, మెటీరియల్స్, ఆట బొమ్మలు మొదలైనవి, సుమారు 18,650 విలువ చేసే వస్తువులు వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంసిఎ విభాగాధిపతి డాక్టర్ నవీన్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మరథముతు, విద్యార్థులు పాల్గొన్నారు.

23 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లిలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు కంటి వైద్య శిబిరంలో 23 మంది కంటి రోగులకు ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, ఎర్రవారి పాలెం, కె.వి.పల్లి, కలకడ, కలికిరి, పెద్దమండెం, గుర్రంకొండ, కదిరి, ఎన్.పి కుంట, వేంపల్లి, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 23 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాష, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని బాటవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆధ్యా కిడ్నీకేర్ నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబి రానికి సుమారు 150 మంది మూత్రపిండాలకు సంబంధించిన రోగులు హాజరైనట్లు వారు తెలిపారు. వీరిలో 30 మందికి శస్త్రచికిత్సకు అర్హులుగా నిర్ధారించినట్లు వైద్యాధి కారులు పేర్కొన్నారు.. వైద్య శిబిరంలో హైద రాబాద్‌కు విద్యాధికారులు పావనిరెడ్డి, సనత్‌రెడ్డి, భవానిమోహన్ రాజా, పాఠ శాల సిబ్బంది, ఆధ్యా కిడ్నీ కేర్ వైద్యశాల సిబ్బంది ఫారూఖ్, నర్సులు పాల్గొన్నారు.**గాలివీడు :** స్థానిక బస్టాండ్ ఆవరణంలో ఉన్న అమీన్ మెడికల్ స్టోర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన ఉచిత మెగా కంటి విద్య శిబిరానికి 20 మంది హాజరైనట్లు అమీన్ పేర్కొన్నారు. వీరిని శస్త్రచికిత్స కోసం సోమవారం కడపలోని డాక్టర్ మాధవి కంటి వైద్యవైద్యశాలకు పంపుతున్నట్లు తెలిపారు.

హాస్టల్‌ను పరిశీలిస్తున్న బిసి సంక్షేమ సంఘం నాయకులు

బిసి హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి-నందలూరు

బిసి హాస్టల్లో మౌలిక వసతులు కల్పించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుడంరెడ్డి బాబు, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తిలు పేర్కొన్నారు. ఆదివారం నందలూరు బిసి బాలుర వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థుల వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయివేట్ వసతి గృహంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇన్‌చార్జి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ అందుబాటులో లేకపోవడం, రాత్రి వేళల్లో విద్యార్థులు వసతి గృహంలో నిద్రించకుండా ఇళ్లకు వెళుతున్నారని అన్నారు. అధికారులు దృష్టి సారించి హాస్టల్లో మెరుగైన వసతులు కల్పించి విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప నగర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్ఎండి యూసఫ్, పాల్గొన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణానికి చెందిన జస్వంత్ ఏడాది క్రితం మృతి చెందారు. స్నేహితుడి జన్మదినం సందర్భ:గా ఆదివారం అతని స్నేహితులు పట్టణంలోని జ్యోతి చౌక్ బస్టాండ్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాతోపాటు కలిసి ఆడి పాడిన స్నేహితుడు మా మధ్య లేకపోవడం దురదృష్టకరమన్నారు. తనతో గడిపిన జ్ఞాపకాలు ఎప్పటికీ మాతో ఉండిపోతాయన్నారు. అతని జ్ఞాపకార్థం పేదలకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జస్వంత్ కుటుంబ సభ్యులతోపాటు స్నేహితులు గౌస్, అల్తాఫ్, ధ్రువ, సయ్యద్, నిరంజన్, నాసర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కెకె చౌదరి

నేడు టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో సోమవారం రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో నూతన టిడిపి కార్యాలయం ప్రారంభోత్సవం జరగనుం దని టిడిపి మండల అధ్యక్షులు కెకె.చౌదరి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్, టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తానా మాజీ అధ్యక్షులు వేమన సతీష్ పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జయహో బిసి సమావేశంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ, మండల టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతిఒక్కర పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి అనంతయ్య యాదవ్, రాజంపేట పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యనిర్వహణ కార్యదర్శి బుంగటావుల రాజశేఖర్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు గుండాలయ్య యాదవ్, మండల సీనియర్ నాయకులు బి. సుబ్బనాగులు, దుగ్గిన వెంకటయ్య, మాచిన సుబ్బరామయ్య, బుర్రు సుబ్రమణ్యం యాదవ్, పార్లమెంట్ తెలుగుయువత అధికార ప్రతినిధి బాలకృష్ణ యాదవ్, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు పెంచలయ్య పాల్గొన్నారు.

రూపానందరెడ్డి సమక్షంలోనే టిడిపిలో చేరా..

ప్రజాశక్తి-పుల్లంపేట

జనవరి 18వ తేదీన విజయవాడ పార్టీ కేంద్ర కార్యాలయంలో ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరినట్లు పుత్తనవారిపల్లి సర్పంచ్ సుభాషిని భర్త సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు పుల్లంపేటకు విచ్చేసి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న తనకు ఓటరు లిస్టు పంపిణీ చేసే సందర్భంలో నాకు పార్టీ కండువా కప్పి విశ్వనాథ నాయుడు సమక్షంలో టిడిపి చేరినట్లు ప్రచారం చేస్తున్నారని ఇది అవాస్తవమని అన్నారు.

పాఠశాల భవన నిర్మాణ పనులు తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని తల్లెంవారిపల్లె గ్రామంలో ప్రారంభానికి సిద్ధమవుతున్న నూతన ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను ఆదివారం ఎపి టూరిజం రాష్ట్ర డైరెక్టర్ వత్తలూరు సాయి కిషోర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో ప్రథమ స్థానంలో నిలపాలన్న దృఢ నిశ్చయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. నాడు-నేడు కార్యక్రమంతో పాఠశాల రూపురేఖలు మార్చారని అన్నారు. విద్యావ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిపిని ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. విద్యారంగంలో నూతన సంస్కరణలు తీసుక వచ్చారని అన్నారు. ప్రతీ విద్యార్థి పట్టుదలతో చదివి ఉన్నతశిఖరాలకు అధిరోహించాలని సూచించారు. స్థానిక కాంట్రాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిటిసి కొత్త నరసింహులు, కొర్లకుంట ఉపసర్పంచ్ ముక్కా రూపేష్‌రెడ్డి, చింతకొమ్మదిన్నె రామమోహన్, మాజీ ఎంపిపి రామకృష్ణ, కొమ్మూరు ఉమాశంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

టిడిపి,జనసేన కూటమిదే అధికారం

- కొండా నరేంద్ర వెల్లడి

సమావేశంలో మాట్లాడుతున్న కొండా నరేంద్ర

ప్రజాశక్తి-బి.కొత్తకోట

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమిదే విజయమని టిడిపి నాయకులు కొండా నరేంద్ర పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోనే కొండా ఎస్టేట్‌లో కొండా నరేంద్ర ఆధ్వర్యంలో నియోజకవర్గం స్థాయి టిడిపి - జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టిడిపి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కొండా నరేంద్ర మాట్లాడుతూ త్వరలో జరగబోవు శాసనసభ ఎన్నికలకు ఇరు పార్టీల శ్రేణులను సమాయత్తం చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అధికార వైసిపి అవలంబిస్తున్న అరాచక విధానాలతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. ప్రజలకు అన్నివిధాలా మేలు జరగాలంటే జనసేన-టిడిపి కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సేవ చేయాలనే ఉద్దేశంతో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఆశిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కావున ఈ ఆత్మీయ సమా వేశానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. తాను ప్రజా సేవే ధ్యే యంగా రాజకీయాల్లోకి వచ్చానని డబ్బు సంపాదన కోసం రాజకీయాల్లోకి రావట్లేదని అన్నారు. అనంతరం సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ టిడిపి-జనసేన ఆత్మీయ సమావేశానికి అంత పెద్ద ఎత్తున నాయకులు,కార్యకర్తలు తరలి రావడం ఆనందంగా ఉందన్నారు.త్వరలో జరగబోవు శాసనసభ, పార్ల మెంటు ఎన్నికల్లో కూటమి సునామీ సృష్టిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు బండి వెంకటేశ్వర్లు, రామంజి, సయ్యద్, నాగేంద్ర, అర్జున్, కరుణాకర్, శంకర, సూరి, మధుకర్, శంకర్,పాల్గొన్నారు.

వైసిపి విజయమే లక్ష్యం : నిస్సార్ అహ్మద్

నిస్సార్ అహ్మద్‌కు స్వాగతం పలుకుతున్న మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మదనపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ ఆదివారం నిమ్మనపల్లి మండలంలోని సింగంవారిపల్లిలో పర్యటించారు. మదనపల్లిలో వ్యాపారవేత్తలు అయినా సోదరులు ఖాజాపీర్, దాదాపీర్, పిలుపుమేరకు సింగం వారిపల్లెకు విచ్చేసి వారు ఏర్పాటుచేసిన విందులో మదనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, వైసిపి మండల అధ్యక్షులు సదాశివరెడ్డి, మైనారిటీ నాయకులు, మం డల నాయకులు, సర్పం చ్‌లు, ఎంపిటిసిలు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు అన్నిటిని నెరవేర్చారని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని పేర్కొన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి విజయానికి వర్గ విభేదాలు లేకుండా ఐక్యమత్యంతో ఉంటూ పార్టీని గెలిపించుకుందామని తెలిపారు. అతి త్వరలోనే వైసిపి పార్టీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధులతో, ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రజాప్రతి నిధులతో, నాయకులతో, కార్యకర్తలు, అభిమానులతో కలసి నియోజకవర్గంలోని ప్రతిగ్రామంలో పర్యటించి పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సుషెల్టర్ నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-పుల్లంపేట

బస్సుషెల్టర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సాయికిషోర్‌రెడ్డి

మండల పరిధిలోని చిన్న ఓరంపాడు క్రాస్ దగ్గర ఎపి టూరిజం డైరెక్టర్, మండల కన్వీనర్ కొత్త లూరు సాయికిషోర్‌రెడ్డి తన సొంత నిధులతో నిర్మిస్తున్న బస్సు షెల్టర్ నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వారు అవస రాల నిమిత్తం బస్సుషెల్టర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చినప్పుడు బస్సు షెల్టర్ నిర్మాణం లేక ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి తీసుక వచ్చారని అన్నారు. వెంటనే స్పందించి తన సొంత నిధులతో బస్‌షెల్టర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని సమస్యలు తన దృష్టికి తీసుకవస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో కొర్లకుంట ఉపసర్పంచ్ ముక్కా రూపేష్ రెడ్డి, వైసిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, మధురెడ్డి,రామమోహన్ పాల్గొన్నారు.

వైసిపి పాలనకు చరమగీతం : జనసేన

కరపత్రాలు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-సుండుపల్లి

అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వైసిపి పాలనకు చరమగీతం పాడాలని జనసేన నాయకులు రామ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలో పెద్దినేనికాలువ గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో జనసేన ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామ శ్రీనివాస్ మాట్లాడుతూ అధికార వైసిపి అవలంబిస్తున్న అరాచక విధానాలతో ప్రజలు విసిగిపో యారని అన్నారు. ప్రజలకు అన్నివిధాలా మేలు జరగాలంటే జనసేన-టిడిపి కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. సుపరిపాలన కోసం జనసేనను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మదన్, మనోహర్, రవీంద్ర, చంద్రశేఖర్, లోకేష్, సౌకత్, రామంజులు, సురేష్, బాబు, నాగార్జున, సాయి, ప్రతాప్, జనసైనికులు పాల్గొన్నారు.

వేరుశనగ నూర్పిడి ముమ్మరం

దిగుబడి, ధరలు ఆశాజనకం - రైతుల్లో హర్షం

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో మండలంలో సాగు చేసిన వేరుశనగ పంట నూర్పిళ్లు రైతులు ముమ్మరం చేశారు. వెదురూరు, రాజుపాలెం, నరహరిపురం, తిప్పిరెడ్డిపల్లె గ్రామాల పరిధిలో సుమారుగా 2వేల ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం పంట పూర్తికావడంతో నూర్పిడి చేస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు నూర్పిడి పనులు పూర్తయ్యాయి. కొంతమంది రైతులు కూలీలతో నూర్పిడి పనులు చేయిస్తుండగా, మరికొంతమంది కూలీలతో వేరుశనగ పంటను పీకించి, తర్వాత యంత్రాల ద్వారా కాయలను నూర్పిడి చేయిస్తున్నారు. కూలీలకు ఒక బస్తా వేరుశనగ కాయలు నూర్పిడి చేసినందుకు రూ.700 చెల్లిస్తున్నారు. ఎకరా పంట నూర్పిడి చేసినందుకు యంత్రానికి రూ.6వేలు ఖర్చు వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరా పంట పూర్తిగా నూర్పిడి చేసేందుకు రూ.13వేలు అవుతుందని తెలుస్తోంది. దిగుబడి ఆశాజనకంగా ఉందని, ఎకరాకు 36 నుంచి 40బస్తాల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. ఎకరా వేరుశనగ పంట సాగుకు, ఎరువులు, మందులు నూర్పిడి వరకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం బస్తా ధర రూ.2,800 నుంచి రూ.3వేల వరకు ఉంది. చాలా మంది రైతులు పంట పొలాల్లో వేరుశనగ కాయలు తూకాలు వేస్తున్నారు.

తిప్పిరెడ్డిపల్లె వద్ద యంత్రంతో వేరుశనగ పంట నూర్పిడి చేస్తున్న కూలీలు

వేరుశనగ పంట నూర్పిడి చేసేందుకు కూలీల కొరత అధికంగా ఉండడంతో చెన్నూరు, మైదుకూరు, ఖాజీపేట ప్రాంతాల నుండి ఆటోల్లో పిలిపిం చుకుంటున్నారు. ఉదయం 7 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వేరుశనగ పంట నూర్పిడి చేసినందుకు రూ.300 చెల్లించి, ఆటో బాడుగ రైతులు భరిస్తున్నారు. ఈ ఏడాది వేరుశనగ సాగు వలన మేలు జరిగిందని, అయితే చాలా వరకు సాగు ఖర్చులు పెరిగాయని రైతులు పేర్కొంటున్నారు.

ప్రజ్ఞావికాసం పరీక్షను విజయవంతం చేయండి : ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 6న పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రజ్ఞ వికాస్ మోడల్ టెస్టు పరీక్షను విజయవంతం చేయాలని జీవన్‌జ్యోతి హైస్కూల్ వద్ద ఆ పాఠశాల కరస్పాండెంట్ అమర్నాథ్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు గుర్రం డేవిడ్‌రాజ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలు అంటే భయం పోగొట్టేందుకు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ప్రతి సంవత్సరం ప్రజ్ఞా వికాసం పరీక్షలు నిర్వహిస్తూ వస్తోందన్నారు. ఈ పరీక్ష పేపర్‌ను ప్రముఖ విద్యావేత్త కెఎస్ లక్ష్మణరావు తయారు చేశారన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30 వరకు ఉంటుందన్నారు. ప్రతిభ కనబ రిచిన విద్యార్థులకు మండలస్థాయిలో మొదటి మూడు బహుమతులు, జిల్లా స్థాయిలో టాప్ 10 ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు చెప్పారు. రూ.20 ఎంట్రీ ఫీజు ఉంటుందన్నారు. వివరాలకు 95024 94474, 91606 14313, 82977 62173 నెంబర్లను సంప్రదించాలన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహకం

ప్రజాశక్తి-చాపాడు

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో మండలంలోని అన్నవరం గ్రామ పంచాయతీకి చెందిన బాలికల జట్టు ఖోఖోలో నియోజక వర్గస్థాయిలో మొదటి స్థానం, బాలుర జట్టు ఖోఖో పోటీలో రెండవ స్థానం నిలిచారు. గెలిచిన క్రీడాకారులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆదివారం ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఖోఖో బాలికల క్రీడాకారులకు రూ.25 వేలు, బాలురకు రూ.25 వేల ఆర్థికసాయం అందించారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడల్లో బాగా పాల్గొని పథకాలు పొంది నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

'రాజోలు' నిర్మించకపోవడంలో అన్ని పార్టీలదీ తప్పిదమే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

కెసి కెనాల్ రైతులకు, జిల్లా తాగునీటి అవసరాలకు ఉద్దేశించబడిన రాజోలు ప్రాజెక్ట్ ఇప్పటికీ పూర్తి కాకపోవడానికి అన్ని పార్టీలది తప్పిదం, నమ్మక ద్రోహం అని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాకు ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు తాము న్యాయం చేశాం అంటూ ఎవరికివారు సభలు, సమావేశాలు పెడుతూ రైతులను మళ్లీ మోసం పుచ్చుతున్నారని తెలిపారు. రాయలసీమకులో రాజధాని ఏర్పాటై ఉంటే మహా నగరంగా అభివృద్ధి చెంది ఉండేదన్నారు. రైతు ఉత్పత్తులకు దళారులతో సంబం ధం లేకుండా అధిక ధరలు దక్కేవని తెలిపారు. రాయలసీమ కోల్పోయి తెలం గాణకు దక్కిన హైదరాబాద్ ఇందుకు సాక్ష్యమన్నారు. అక్కడ రైతుల ఉత్ప త్తులకు అధిక ధరలు లభిస్తున్నాయన్నారు. రాయలసీమలో రాజధాని అవసరం ఉందని తెలిపారు. కెఆర్ఎంబి (క్రిష్ణా రివర్ మేనేజ్ మెంట్ బోర్డ్)ను కడప జిల్లాలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. క్రిష్ణా జలాల్లో రాయల సీమకు మోసం జరుగుతున్నా.. రాయలసీమ అధిక నీళ్లు దోచుకుపోతోందని తెలంగాణాలోని అన్ని పార్టీల వాళ్లు విమర్శిస్తూ ఉన్నారన్నారు. ఆంధ్ర నాయకులు ఈ ప్రచారాన్ని తిప్పికొట్టాలని ప్రతాప్‌రెడ్డి కోరారు.

అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న డిఎస్‌పి

హార్సిలీహిల్స్‌లో పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో అందాలను వీక్షించడానికి దేశంలో నలుమూలల నుంచి పర్యాటకులు విచ్చేస్తుంటారు. పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆదివారం హార్సిలీహిల్స్ గాలిబండవద్ద మదనపల్లి డిఎస్‌పి కే.కేశప్ప పోలీస్ అవుట్ పోస్ట్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ హార్సిలీహిల్స్ దేశంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రఖ్యాతి గడించిందన్నారు. ఇక్కడికి విచ్చేసిన పర్యాటకుల భద్రత కోసం పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో శిక్షణ డిఎస్‌పి జి.ఎస్.ప్రశాంత్, బి.కొత్తకోట సిఐ సూర్యనారాయణ, టూరిజం మేనేజర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

తహశీల్దార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి- రైల్వేకోడూరు

బదిలీపై వెళుతున్న మండల తహశీల్దార్ రామమోహన్‌ను ఆదివారం రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. తాసిల్దారు రామమోహన్‌కు డివిజనల్ రెవెన్యూ డివిజనల్ అధికారిగా పదోన్నతిపై తిరుపతికి బదిలీ కావడంతో ఇన్‌ఛార్జి తహశీల్దార్ అమరేశ్వరి, సిబ్బంది ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రీసర్వే డిటి మానస, ఎన్ ఫోర్స్‌మెంట్ డిటి రెడ్డిప్రసాద్, సర్వేయర్ సుదర్శన్, ఆర్ఐ రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ మల్లికార్జునరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటసాయి రాఘవేంద్ర, జూనియర్ అసిస్టెంట్ రుత్విక్ హర్ష, ఎవిఎస్ఓ షణ్ముగం, విఆర్ఓలు భారతి పాల్గొన్నారు.

వైసిపి ఉన్మాదిలా తయారైంది

వేంపల్లె :వైసిపి ఉన్మాది, పిరికిపంద పార్టీలా తయారైందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు, రాష్ట్ర సమస్యలపై నిర్మాణాత్మక విమర్శలు చేస్తుంటే వైసిపి నాయకులు వాటికి సమాధానం చెప్పకుండా ఆమెపై వ్యక్తి గత విమర్శలు చేయడం శోచనీయమన్నారు. పరోక్షంగా షర్మిలా తల్లి విజయమ్మపై కూడా విమర్శలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లి, చెల్లిని వైసిపి ఉన్మాదులు విమర్శిస్తుంటే ముఖ్యమంత్రి జగన్ నిమ్మకు నీరెత్తినట్లు మౌనంగా ఉండడం గర్హనీయమని తెలిపారు.ధరలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని అన్నారు.

క్రైం కార్నర్

తల్లిని హత్య చేసిన కూతురు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

నవమాసాలు మోసి, కని పెంచిన తల్లిని తన సొంత కూతురే కడతేర్చిన ఘటన ఆదివారం పట్టణంలోని కొత్త ఇందిరమ్మ కాలనీలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..అనంతపురం జిల్లా, కనేకల్ మండలం, హనక నకల్ నివాసి యర్రక్క(43)తన కూతురు, అల్లుడితో స్థానికంగా వలవ వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని తెలిపారు. గత రెండు రోజులుగా కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవన్నారు. శనివారం అర్ధరాత్రి సొంత కూతురు నందిని, అల్లుడు శివరాంలు కలసి ఐరన్‌రాడ్, కట్టెలతో కొట్టి యర్రక్కను చంపేసి, పరారయ్యారని తెలిపారు. స్థానికుల సమాచారంతో సంఘటనాస్థలానికి చేరుకొని పరిశీలించినట్లు తెలిపారు. అప్పటికే యర్రక్క మృతి చెంది ఉండడంతో.. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. యర్రక్క మృతికి కుటుంబ కలహాలా, లేక ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

ఐదుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు..ఆదివారం తవళం పంచాయతీ చౌకిళ్లవారిపల్లికు సమీపంలో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందని అన్నారు. తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి బోదాల కిరణ్ కుమార్, పెద్దారెడ్డి వెంకటరమణారెడ్డి , గోదాల రాజశేఖర్, షేక్ సయ్యద్ బాషా, చింత మానుగురుమూర్తిలను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.2,720 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-గాలివీడు

కన్న కొడుకు అనారోగ్యంతో మృతి చెందాడనే మనస్తాపంతో తల్లి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండలంలోని ఎగువగొట్టివీడుకు చెందిన తలారి రామలక్ష్మమ్మ(23) కుమారుడు వినోద్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడని తెలిపారు. అప్పటి నుంచి మనస్తాపానికి గురైన రామలక్షుమ్మ మూడు రోజుల నుంచి కనిపించలేదని భర్త వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆదివారం ఎగువగొట్టివీడు సమీపంలోని బావితో మృతదేహం రామలక్షుమ్మదిగా గుర్తించినట్లు తెలిపారు. తన కొడుకు మృతిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-ములకలచెరువు

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ములకల చెరువు మండలం, సెంట్రల్ స్కూల్ పంచాయతీ, నల్లచెరువు పల్లి చెందిన నరేందర్‌రెడ్డి(25) వ్యవసాయం చేసుకుంటే జీవనం సాగిస్తున్నాడని అన్నారు. సెంట్రల్ స్కూల్ నుంచి ద్విచక్రవాహనంలో ఇంటికి వెళుతుండగా మధ్యంలో గుర్తు తెలియని వాహనం ఢీకొటిందని తెలిపారు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని 108లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందాడని పేర్కొన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

అడవి జంతువులు చంపేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మండల పరిధిలోని బంగ్లామిట్ట గిరిజనకాలనీలో నివాసమున్న చంద్రయ్య కుమారుడు సుబ్రహ్మణ్యం చేపలు పట్టుకొని జీవనం సాగించే వాడని తెలిపారు. ఆదివారం సమీపంలోని చేపలు పట్టుకునేందుకు సమీపంలోని చెరువుదగ్గరకు వెళ్లగా గుర్తు తెలియని వ్యక్తులు అడవి జంతువును పట్టుకునేందుకు అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.